సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 32 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

38.3°/21.9°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

18 నుంచి వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం



సత్యసాయి మహా సమాధి (ఫైల్)

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ దసరా ఉత్సవాల్లో భాగంగా ఏటా ప్రశాంతి నిలయంలో నిర్వహించే వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. అందులో భాగంగా 15వ తేదీ ప్రశాంతి నిలయంలోని భజన మందిరంలో కలశ స్థాపన చేస్తారు. 18న ఉదయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ప్రారంభమవుతుంది. ఇప్పటికే ప్రశాంతి నిలయంలో దసరా వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. వేడుకల్లో భాగంగా 18వ తేదీ నుంచి రోజూ సత్యసాయి మహాసమాధి చెంత ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 24న పూర్ణాహుతితో యజ్ఞం క్రతువు ముగియనుంది.

సీఆర్‌పీఎఫ్ బైక్ ర్యాలీకి ఘన స్వాగతం



సీఆర్‌పీఎఫ్ జవాన్లకు స్వాగతం పలుకుతున్న ఎస్‌ఐ గంగాధర్

చిలమత్తూరు: 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రజల్లో జాతీయ సమైక్యత పెంపొందించే లక్ష్యంతో సీఆర్‌పీఎఫ్ ఉమెన్ వింగ్ చేపట్టిన బైక్ ర్యాలీకి శనివారం కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఘన స్వాగతం లభించింది. సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సింధూ నేతృత్వంలో 50 మంది సీఆర్‌పీఎఫ్ ఉమెన్ ఆఫీసర్లు 25 బైక్‌లపై కన్యాకుమారి నుంచి గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ర్యాలీకి కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద స్థానిక ఎస్‌ఐ గంగాధర్ ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ కమాండెంట్ సింధూ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మరవకొత్తపల్లి సమీపంలోని విరాట్ ప్యాలెస్‌లో కాసేపు విరామం తీసుకున్న సీఆర్‌పీఎఫ్ ఉమెన్ ఆఫీసర్లు తిరిగి బైక్ ర్యాలీని కొనసాగించారు.

టాపు లేపిన కే-6

- 45 కిలోల వేరుశనగ బస్తా రూ.4,200



ఎనుములపల్లి రైతు సిద్ధం చేసిన కే-6 రకం వేరుశనగకాయలు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో ముందస్తుగా సాగు చేసిన కే-6 రకం వేరుశనగ రైతులకు కాసులు కురిపిస్తోంది. దిగుబడి బాగా రావడంతో పాటు ధర కూడా ఆశించిన దానికి మించి ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లా రైతులు కే-6, కదిరి లేపాక్షి, గిరినార్-4 విత్తన రకాలతో వేరుశనగ సాగుచేశారు. ఇందులో కే-6, కదిరి లేపాక్షి వేరుశనగ రకాలు మంచి దిగుబడినిచ్చాయి. కే-6 (అవుటన్ 77.78 శాతం) రకం 45 కిలోల బస్తాను వ్యాపారులు రూ.4,200తో కొనుగోలు చేస్తున్నారు. ఇక కదిరి లేపాక్షి రకం 45 కిలోల బస్తా రూ.3 వేల మేర పలుకుతోంది. అవుటన్ తక్కువగా ఉన్న కాయలను వ్యాపారులు రూ.2 వేలతో కొనుగోలు చేస్తున్నారు. కే-6 కాయలకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో ముందస్తుగా బోరు బావుల కింద సాగు చేయడంతో ఎకరాకు 20 బస్తాలకుపైగా దిగుబడులు వచ్చాయని రైతులు చెబుతున్నారు.



- బత్తలపల్లికి సమీపంలోని ఈ ఖర్జూరపు తోట ధర్మవరం పట్టణవాసి నాగరాజుకు చెందినది. ఏడేళ్ల క్రితమే 20 ఎకరాల్లో సుమారు 1,400 చెట్లు నాటారు. దాదాపు రూ.2 కోట్ల పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఏడాదికి రూ.60 లక్షల వరకు విలువైన దిగుబడి వస్తోందని రైతు చెబుతున్నారు. చెన్నై, హైదరాబాద్, కోయంబత్తూరు, కర్ణాటక, కేరళకు చెందిన వ్యాపారులు ఇక్కడికే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

- ఇది అవకాడో పంట. శెట్టూరు మండలం పెరుగుపాళ్యం పంచాయతీలోని వడ్డేపాళ్యం అనే మారుమూల గ్రామంలో రైతు సిద్దారెడ్డి రెండెకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ఒక్కో మొక్కను రూ.200తో కర్ణాటకలో కొనుగోలు చేసి.. రెండెకరాల్లో 400 మొక్కలు నాటారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. సెంట్రల్ మెక్సికో ప్రాంతానికి చెందిన ఈ పంటను ఇక్కడ సాగు చేయడం విశేషం. ఈ రైతే మరో రెండెకరాలలో డ్రాగన్‌ఫ్రూట్స్ పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.





- ఇది డ్రాగన్ ఫ్రూట్ తోట. బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన రైతు కంచనగారి దామోదర్‌రెడ్డి తనకున్న పదెకరాలలో మూడేళ్ల క్రితం సాగు చేశారు. రూ.90 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక విస్తీర్ణంలో ఈ పంట సాగు చేసిన రైతు కూడా ఈయనే. తెలంగాణలో పర్యటించి అక్కడి రైతుల అనుభవాలను తెలుసుకుని మరీ పంట వేశారు. ప్రస్తుతం ఏడాదికి మూడు కోతలు వస్తున్నాయని, ఐదేళ్లు దాటితే దిగుబడి మరింత పెరుగుతుందని రైతు చెబుతున్నారు.

మన ఇంట.. అరుదైన పంట

- ఉద్యాన పంటల సాగులో వైవిధ్యం
- రకరకాల పంటలతో రైతుల ప్రయోగాలు
- అంజూర మొదలుకుని అవకాడో వరకు సాగు



అమరాపురం మండలం తమ్మడేపల్లి రైతు సిద్దప్ప సాగు చేసిన వక్క తోట ఇది. మడకశిర ప్రాంతంలోని రైతులు 6,200 ఎకరాల్లో వక్క తోటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సాక్షి, అనంతపురం డెస్క్: ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయంగా ఉండేది. వేరుశనగ, పప్పుశనగ, కంది వంటి వర్షాధార పంటలు మినహా మిగిలిన పంటలు పెద్దగా సాగు చేసేవారు కాదు. వరుణుడు కరుణించి పంటలు పండితే సరి. లేదంటే రైతులకు నష్టాలు, కష్టాలే. ఇప్పుడు పరిస్థితులు మారాయి. సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. అరుదైన పంటలు సైతం సాగు చేస్తూ జిల్లాకు ప్రత్యేకతను తెచ్చి పెడుతున్నారు.

ప్రయోగాల్లో మేటి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు లక్షల హెక్టార్లకు పైగా ఉద్యాన తోటలు సాగులో ఉన్నాయి. ఇందులో పండ్లతోటలే 1.20 లక్షల హెక్టార్ల వరకు సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల్లో ప్రయోగాలు చేయడానికి రైతులు ఏమాత్రమూ వెనుకాడడం లేదు. చీనీ, మామిడి, అరటి, దానిమ్మ, బొప్పాయి, సపోటా, కళింగర, కర్బూజ వంటి పండ్ల తోటలను పెద్దఎత్తున సాగుచేస్తూనే..జిల్లాలో గతంలో వేయని పంటలనూ పరిచయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అంజూర, డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూరం, వాటర్ యాపిల్, యాపిల్ బెర్రీ, అవకాడో తదితర పంటలు 'అనంత' ముంగిటకు చేరాయి. వక్క, వెదురు, కలబంద, అశ్వగంధ వంటి తోటలనూ వాణిజ్య కోణంలో సాగు చేస్తూ రైతులు ప్రత్యేకతను చాటుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం..రైతుల ఉత్సాహం

ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. రైతులకు డ్రైల్యాండ్ హార్టికల్చర్, ఇతరత్రా పథకాల కింద సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందజేస్తోంది. తక్కువ నీటితోనే వాటిని సాగుచేసుకునేలా భారీ సబ్సిడీపై బిందు, తుంపర సేద్యపు పరికరాలను సైతం ఇస్తోంది. దీంతో రకరకాల తోటల సాగుకు ముందుకు వస్తున్నారు. ఇక కొందరు అభ్యుదయ రైతులు సొంత నిధులతోనే అరుదైన, విదేశీ పంటలను సైతం జిల్లాకు పరిచయం చేస్తున్నారు. వారిని చూసి మరికొందరు ఆయా పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. క్రమేణా ఆ పంటలను కూడా ప్రభుత్వం సబ్సిడీలు/ప్రోత్సాహకాల పరిధిలోకి తీసుకొచ్చి రైతులకు అండగా నిలుస్తోంది. డ్రాగన్, అంజూర, తైవాన్ జామ తదితర పంటలకూ ప్రోత్సాహకాలు అందిస్తుండడమే ఇందుకు నిదర్శనం.

ఉమ్మడి జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం : 2,02,000 హెక్టార్లు

ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తున్న పండ్లతోటలు :
మామిడి, నిమ్మ, చీనీ, దానిమ్మ, అంజూర, జామ, డ్రాగన్ ఫ్రూట్, చింత, ఉసిరి, నేరేడు

ఉమ్మడి జిల్లాలో సాగులో ఉన్న అరుదైన ఉద్యాన పంటలు :
అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూరం, యాపిల్‌బెర్రీ, వాటర్ యాపిల్, లిచీ, కలర్ క్యాప్సికమ్

నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం

కదిరి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చౌడేశ్వరీదేవి ఆలయం, మరకత మహాలక్ష్మి ఆలయం, వాసవీమాత ఆలయంలో ఆదివారం నుంచి 15వ తేదీ వరకూ దసరా ఉత్సవాలు జరుగుతాయని ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఖాద్రీశుడు మత్స్యావతార అలంకరణలో, చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు జ్యేష్టాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆలయాల ముస్తాబు



ప్రత్యేక అంకరణలో గ్రామ దేవత సత్తెమ్మ

పుట్టపర్తి టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. పుట్టపర్తిలోని సత్తెమ్మ అలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, చిత్రావతి ఒడ్డున, ఎనుములపల్లి వద్ద ఉన్న దుర్గా మాతా ఆలయాలను ఇప్పటికే సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఉత్సవాలకు ముస్తాబైన సత్తెమ్మ దేవాలయం

సీమ సాహితీ దర్పణం రాచపాళెం



రాచపాళెం రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం కల్చరల్: రాయలసీమ సాహిత్యానికి దర్పణం పట్టే రాచపాళెం రచనలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తాయని వక్తలు కొనియాడారు. కేంద్రసాహిత్య అకాడమీ, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాల గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి తన ఆరు దశాబ్దాల సాహితీ జీవిత విశ్లేషణతో రచించిన మూడు పుస్తకాల (విమర్శా పునర్నవం, మన నవలలు, మన కథానికలు) ఆవిష్కరణ మహోత్సవం శనివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి కవులు, రచయితలు, విద్యావేత్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, డాక్టర్ గేయానంద్, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, బండి నారాయణస్వామి, డాక్టర్ నాగేశ్వరాచారి, టీటీడీ పాలకమండలి సభ్యుడు అశ్వత్థనాయక్, నవలా రచయిత రెడ్డప్పరెడ్డి, వరంగల్లు నుంచి విచ్చేసిన డాక్టర్ సంపత్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశాంక మౌళి తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై రాచపాళెం సాహిత్య విశిష్టతలపై మాట్లాడారు. రాచపాళెం రచయితలకు సాహిత్య మార్గాన్ని చూపడమే కాకుండా అందులోని ఎత్తుపల్లాల గురించి నిత్యం అధ్యయనం చేయిస్తుంటారని కొనియాడారు. అంతకు ముందు ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అరసం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన 'వర్తమాన తెలుగు సాహిత్య విమర్శ – వివిధ ధోరణులు' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వల్లూరు శివప్రసాద్, వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్ మాట్లాడారు. డాక్టర్ అనితమ్మ సభాసమన్వయం చేయగా, డాక్టర్ జూటూరు షరీఫ్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీనియర్ కవులు 'జనప్రియ కవి' యంగన్న, మల్లెల నరసింహమూర్తి, డాక్టర్ నానీల నాగేంద్ర, ఈరన్న, రామలింగమయ్య, నబీరసూల్, మహాబోధి కృష్ణమూర్తి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జిరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆనంద్, సురేష్, రియాజుద్దీన్, మధురశ్రీ, కృష్ణవేణి, డాక్టర్ అనంత మాలతి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

అనంతపురం: ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు హౌస్ వైరింగ్, మోటార్ రివైండింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత సాంకేతికత పరిజ్ఞానం, సౌకర్యాలతో హౌస్ వైరింగ్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, ఎలక్ట్రికల్ పరికరాల రిపేర్లు, మోటార్ రివైండింగ్‌పై 45 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు కస్టమర్లతో వ్యవహరించడం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు, 5వ తరగతి వరకూ చదువుకున్న వారు అర్హులు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంటుంది. వివరాలకు 85000 74757, 77807 52418లో సంప్రదించవచ్చు.

ఆర్టీసీ పండుగ ధమాకా

- ప్రయాణికులకు స్పెషల్ అఫర్లు
- రానుపోనూ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- జిల్లా నుంచి వివిధ నగరాలకు 70 సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే 'ప్రత్యేక' ప్రయాణం





స్పెషల్ బస్సులపై అన్ని డిపోల నాయకులతో మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్ (ఫైల్)

పుట్టపర్తి టౌన్: ప్రజా రవాణా సంస్థ పండుగల వేళ ప్రత్యేక ఆఫర్లతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. దసరా, దీపావళి పండుగల వేళ జిల్లా వాసుల సౌకర్యార్థం ముఖ్యనగరాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడిపించేందుకు సిద్ధమైంది. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా నుంచి 70 ప్రత్యేక సర్వీసులు..

దసరా పండుగ సందర్భంగా ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపడానికి ప్రజారవాణా సంస్థ సిద్ధమవుతోంది. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి మహా నగరాలకు ప్రత్యేక సర్వీసులు తిప్పుతోంది. టీడీపీ హయాంలో స్పెషల్ సర్వీసులు నడిపినా ప్రయాణికుల నుంచి 50 శాతం అదనంగా వసూలు చేసేవారు. కానీ ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం పడకుండా రెండేళ్లుగా ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ప్రయాణికులు రానూ పోనూ ఒకేసారి టికెట్టు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కూడా ఇస్తున్నారు.

ఆరు డిపోలు...70 సర్వీసులు

జిల్లాలో పుట్టపర్తి హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ ప్రాంతాల్లోని ప్రజలు ఉద్యోగం, వ్యాపారం, విద్య కోసం ఇలా చాలామంది ముఖ్య నగరాలలో స్థిరపడ్డారు. విజయదశమికి 10 రోజులు సెలవులు కావడంతో సొంతూళ్లకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి వారి సౌకర్యార్థం రద్దీకి అనుగుణంగా జిల్లాలోని 6 ఆర్టీసీ డిపోల నుంచి 70 బస్సులు నడపడానికి ఆర్టీసీ సంస్థ రంగం సిద్ధం చేసింది. జిల్లాలో అన్ని డిపోల నుంచి ప్రజల సౌకర్యార్థం ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు ముఖ్యనగరాలైన హైదరాబాద్‌కు 30, బెంగళూరుకు 20, తిరుపతికి 10, విజయవాడకు 5 సర్వీసులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే జిల్లాలోనూ 15 సర్వీసులు తిప్పాలని నిర్ణయించారు. మొత్తంగా 70 సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పండుగ కోసం సొంతూళ్లకు వచ్చేవారు తిరిగి ముఖ్య నగరాలకు వెళ్లేందుకు 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ 55 సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లోనూ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి

దసరా పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకూ జిల్లాలోని ముఖ్య నగరాలకు 70 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. ప్రత్యేక సర్వీసుల్లో కూడా సాధారణ చార్జీలు వసూలు చేస్తాం. తిరుగు ప్రయాణంలోనూ 55 బస్సులు నడుతున్నాం. రానూపోనూ టికెట్టు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తాం.

– మధుసూదన్, జిల్లా ప్రజారవాణా అధికారి

ధ్రువీకరణ పత్రం.. ఇక శాశ్వతం

- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు ఒక్కసారి పొందితే చాలు
- ఒరిజినల్ పోయినా అదే నంబర్‌పై కొత్త సర్టిఫికెట్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు విద్య, ఉద్యోగం తదితర అవసరాలకు కుల ధ్రువీకరణ పత్రాలు చాలా కీలకంగా మారాయి. అయితే వీటి జారీలో ఇప్పటి వరకూ సవాలక్ష నిబంధనల కారణంగా ఆయా వర్గాల వారు ఇబ్బంది పడుతూ వచ్చారు. ఈ పరిస్థితిని గమనించిన జగనన్న సర్కార్.. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో సడలింపులు తీసుకువచ్చింది. ఇందులో భాగంగా ఇప్పటికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి అర్హులైన వారికి వారి ఇంటి ముంగిటకే ధ్రువీకరణ పత్రాలను అందజేసింది. అంతటితో ఆగకుండా ఒక్కసారి కుల ధ్రువీకరణ పత్రాన్ని పొందితే దానిని శాశ్వత పత్రంగా పరిగణిచాలంటూ అన్ని ప్రభుత్వ శాఖలకూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీకి సచివాలయాల పరిధిలోని ఆరు దశల తనిఖీ సరిపోతుందని స్పష్టం చేసింది.

ఒరిజినల్ పోతే.. అదే నంబర్‌తో కొత్తది

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకునే విషయంలో ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. ఈ క్రమంలో కుల ధ్రువీకరణ పత్రాన్ని ఒక్కసారి పొందితే చాలు దానిని శాశ్వత పత్రంగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ప్రజలు పొందిన సర్టిఫికెట్ ఎక్కడైనా పోగొట్టుకుని పోతే వాటి కోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసువాల్సిన అవసరం లేదు. ఇందుకు సంబంధించి గతంలో పొందిన సర్టిఫికెట్ నకలు ఉంటే దానిని తీసుకెళ్లి సచివాలయం, మీసేవ కేంద్రం, సీఎస్‌సీ సెంటర్లలో చూపడంతో ద్వారా అదే నంబర్‌తో కొత్త సర్టిఫికెట్‌ను వెంటనే అందజేస్తారు. ఇందు కోసం కొత్తగా ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. అలాగే కుటుంబంలో గతంలో ఎవరూ ఎలాంటి సర్టిఫికెట్ పొంది ఉండకపోతే దరఖాస్తుదారు ప్రస్తుతం ఈ–కేవైసీ చేయించుకుని తహసీల్దార్ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఒకవేళ దరఖాస్తుదారు ఈ–కేవైసీ చేయించుకుని సర్టిఫికెట్ పొంది ఉంటే అతని రక్త సంబంధీకులు ఎవరైనా ఎలాంటి వెరిఫికేషన్ లేకుండా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చు.

జగనన్న సురక్షలో లక్షలాది సర్టిఫికెట్లు:

గత జూన్–జులై మాసాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించి వాటిని గ్రామ సభల్లో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలను సర్వే చేసి, 4,80,439 మందికి నిర్ణీత గడువు లోపు సర్టిఫికెట్లు అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఇందులో అత్యధికంగా కుల, ఆదాయ, నివాసాలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉండడం గమనార్హం. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై ఇవన్నీ శాశ్వత సర్టిఫికెట్లుగా గుర్తించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఒక్కసారి తీసుకుంటే చాలు

ఎవరైనా ఒక్కసారి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను పొందితే చాలు. వాటిని శాశ్వత ధ్రువీకరణ పత్రాలుగా పరిగణిస్తాం. కొత్త సర్టిఫికెట్ కోసం ఒత్తిడి చేకూడదని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సైతం ఆదేశాలు జారీ చేశాం. – అరుణ్‌బాబు, కలెక్టర్

నకిలీ బంగారం విక్రేతల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న నకిలీ బంగారాన్ని చూపుతున్న పోలీసులు

చిలమత్తూరు: అమాయకులను లక్ష్యంగా చేసుకుని నకిలీ బంగారాన్ని విక్రయించి మోసాలకు పాల్పడే ముఠా సభ్యులను చిలమత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ గంగాధర్ వెల్లడించారు. బాగేపల్లి తాలూకా పెమ్మయ్యగారిపల్లికి చెందిన పి.గోపాల్, వెంకటరమణ, చింతామణి తాలూకా గంజికుంట నివాసి శివమణి పూల వ్యాపారంతో జీవనం సాగించేవారు. అయితే వ్యసనాలకు బానిసైన వీరు డబ్బు కోసం మోసాలకు తెరలేపారు. ఇందులో భాగంగా తక్కువ ధరకే బంగారం అందజేస్తామంటూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను నమ్మించి నకిలీ బంగారం పూసలు అంటగట్టి ఉడాయించేవారు. శుక్రవారం రాత్రి కొడికొండ చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న గోపాల్, వెంకటరమణ, శివమణిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నకిలీ బంగారం బాగోతం వెలుగు చూసింది. వారి నుంచి 2.85 కిలోల నకిలీ బంగారం పూసలు, 0.36 గ్రాముల మేలిమి బంగారం పూసలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పిల్లల్లో పునాది స్థాయి బలంగా ఉండాలి

- తొలివిడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ముగింపులో డీఈఓ నాగరాజు


మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాభ్యాసానికి సంబంధించి పిల్లల్లో పునాది స్థాయి బలంగా ఉంటే ఉన్నత స్థాయి చదువు సులువుగా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వి.నాగరాజు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 అంగన్‌వాడీ పిల్లల్లో పునాదిస్థాయి అక్షరజ్ఞానం, సంఖ్యలకు సంబంధించిన జ్ఞానాన్ని ఎలా నేర్పాలో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడానికి డీఆర్పీల (ఎస్‌జీటీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్)కు తొలివిడత శిక్షణ శనివారం ముగిసింది. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల డీఆర్పీలకు ఈ నెల 9 నుంచి అనంతపురం శివారులోని ఇంజినీరింగ్ కళాశాలలో వసతితో కూడిన శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ పిల్లలకు అక్షరాలు, అంకెలు బాగా నేర్పిస్తే ఉన్నత తరగతుల్లో అభ్యాసం సులభంగా ఉంటుందన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణలో నేర్చుకొన్న అంశాలను మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమర్థవంతంగా చేర్చాలని సూచించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల పిల్లలకు నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్మెంట్ సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్టీ ప్రతినిధి కేశవరెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సమగ్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జీసీడీఓ మహేశ్వరి, ఎంఈఓలు, అసిస్టెంట్ ఏఎంఓలు పాల్గొన్నారు.

● ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బళ్లారిలో ధర్మవరం వాసి దుర్మరణం


ముత్యాలు (ఫైల్)

బళ్లారి రూరల్: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని బెంచికొట్టాల వద్ద లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. బళ్లారి రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నివాసి ముత్యాలు (39) ఇళ్లపై సోలార్ పరికరాల ఏర్పాటు పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం హైదరాబాద్ నుంచి సోలార్ పరికరాలను తన లగేజీ కారులో తీసుకు వచ్చిన ఆయన బళ్లారి మీదుగా ధర్మవరం ప్రయాణమయ్యాడు. రాత్రి 8 గంటలకు బెంచికొట్టాల వద్ద ప్రయాణిస్తుండగా రోడ్డుకు అడ్డంగా వెళుతున్న పామును గమనించి తన వాహనాన్ని ఆపాడు. అదే సమయంలో ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ముత్యాలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై బళ్లారి రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సెబ్ పోలీసుల విస్తృత తనిఖీలు

పుట్టపర్తి టౌన్: జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు హిందూపురం, రొద్దం , మడకశిర, చెన్నేకొత్తపల్లి, గుడిబండ మండలాల్లో సెబ్ పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. రొద్దం మండలం గౌరాజుపల్లిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని 104 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే హిందూపురం పరిధిలో 1, కనగానిపల్లి వద్ద 10, మడకశిరలో 1, గుడిబండ, మడకశిర మండలాల్లో 3 చొప్పున కేసులు నమోదు చేసి 91 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. తనకల్లు పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, నాలుగు టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసుల్లో నిందితులపై కేసు నమోదు చేశారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని పలు రేషన్ షాపులు, వాణిజ్య దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చౌకధాన్యపు డిపోల్లో 20 కిలోల బియ్యానికి గాను 1.5 కిలోలు తక్కువగా వేస్తున్నట్లుగా గుర్తించారు. అలాగే ప్యాకేజీ వస్తువులపై తయారీదారు చిరునామా, నెల, సంవత్సరం ఎమ్మార్పీ లేకపోవడంతో కేసులు నమోదు చేశారు. కాగా, కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడల ప్రాంతాల్లో చేపట్టిన తనఖీల్లో మూడు కేసులు నమోదు చేసినట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ తెలిపారు. అలాగే ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరతో అమ్ముతున్న కూల్‌డ్రింక్స్ దుకాణాల నిర్వాహకులు ఐదుగురిపై కేసులు నమోదు చేసి రూ.43 వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న పోలీసులు

కనగానపల్లి: కోనాపురంలో శనివారం సాయంత్రం 23 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. పోలీసు తనిఖీల్లో భాగంగా గ్రామంలోని బోయ చంద్రాయుడు, చాకలి ముత్యాలు ఇళ్లలో మద్యం విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.